పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంద కృష్ణ మాదిగ, క్రాంతి తదితరులు

లక్ష డప్పులు.. వేల గొంతుకలు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ

ఖైరతాబాద్, జనవరి 30: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న నిర్వహించే 'లక్ష డప్పులు-వేల గొంతుకలు' సాంస్కృతిక ప్రదర్శనకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామని, ఆయన రాకుండా ఓ వర్గానికి వత్తాసు పలికితే మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సాంస్కృతిక ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మందకృష్ణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి హోదాలో ఎస్సీ వర్గీకరణను భారతదేశంలో అందరి కంటే ముందే అమలు చేస్తామని, గతేడాది ఆగస్టు 1న హామీ ఇచ్చారన్నారు. కానీ, ఆర్నెళ్లు గడిచినా ఇంకా జాప్యం చేయడం వల్ల సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన విద్య, ఉద్యోగాల్లో నష్టపోతున్నామన్నారు. మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని స్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారని ఎద్దేవా చేశారు. తాము పిలిచినప్పుడు అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్సార్‌లు వచ్చారని గుర్తు చేశారు.

సుక్కేసి చక్రం తిప్పితే.. అంతే..

డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దు వేగవంతం

గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 16,904

గ్రేటర్‌లో 7,903 లైసెన్స్‌ల రద్దు

ప్రస్తుతం 2,412 లైసెన్స్‌లు ఆర్టీఏ పరిశీలనలో

నిబంధనల అతిక్రమణలపై కొరడా

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో అవగాహన కార్యక్రమాలు

"మద్యం సేవించి ఆ మత్తులో డ్రైవింగ్‌పై నియంత్రణ కోల్పోయి ఇతరుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. నగర రహదారులపై స్పీడ్ లిమిట్ నిబంధన ఉన్నప్పటికీ దానిని ఏ మాత్రం పట్టించుకోకుండా దూసుకొస్తున్నారు. రద్దీగా ఉండే రోడ్లపై సైతం వేగంగా వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి క్రమశిక్షణ రాహిత్య డ్రైవింగ్‌తో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. కేసు నమోదు కావడంతో పాటు డ్రైవర్ల లైసెన్స్ రద్దు చేసేందుకు అధికార యంత్రాంగం పరిశీలిస్తుంది. అందుకే డ్రైవింగ్ లైసెన్స్ ప్రక్రియను ఆర్టీఏ అధికారులు వేగవంతం చేశారు. ప్రస్తుతం ఆర్టీఏ అధికారుల ముందర 2,412 లైసెన్సుల రద్దు పరిశీలనకు ఉండటం విశేషం. ఇందులో మందుబాబులే అధికంగా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారని అధికారులు తెలిపారు. గ్రేటర్‌లో 3012 లైసెన్సుల రద్దు మందు బాబులదే కావడం విశేషం. కాగా, గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 16,904, నగరం వ్యాప్తంగా 7,903 లైసెన్స్‌లు రద్దయ్యాయి"

అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ పురుషోత్తమ్ రెడ్డి, చిత్రంలో తదితరులు

సిటీబ్యూరో, జనవరి 30(నమస్తే తెలంగాణ): వాహనదారుల నిర్లక్ష్యంపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై డ్రైవింగ్ లైసెన్స్ రద్దును ప్రయోగిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై, ట్రాఫిక్, రవాణా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. తొలుత జరిమానాలతో సరిపెడుతూనే, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల నుంచి వచ్చే లైసెన్సుల రద్దు ప్రక్రియను వేగవంతం చేసి ఉల్లంఘనులను బెంబేలెత్తిస్తున్నారు. లైసెన్స్‌ను సస్పెండ్ చేసేందుకు కేసులను రెండు కేటగిరీలుగా విభజించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన కేసులను మొదటి కేటగిరిగా, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్న వాటిని రెండో కేటగిరిగా వర్గీకరించి కేసులు నమోదు చేస్తున్నారు. వీటితో పాటు రోడ్డు ప్రమాదాల నివారణపై శాశ్వతంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేసే ప్రక్రియపై కూడా కసరత్తు చేస్తున్నారు. కారు నంబర్‌పై స్పీడ్ లేజర్ గన్ చిత్రీకరించిన దృశ్యాలను చూస్తూ పలుమార్లు అతివేగంతో ప్రయాణించడాన్ని ట్రాఫిక్ పోలీసులు గుర్తించి, లైసెన్స్ సస్పెండ్ చేయాలని రవాణా శాఖకు పంపుతున్నారు. అంతే కాదు, లైసెన్స్ రద్దులో ఉన్నప్పుడు వాహనం నడుపుతూ దొరికితే జైలు శిక్ష కూడా పడే వీలుంది. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారుల్లో క్రమశిక్షణ పెంపొందించే కార్యక్రమాలు సైతం అధికారులు నిర్వహిస్తున్నారు.

రద్దు ప్రకియ ఇలా..!

పోలీసుల నుంచి ఉల్లంఘనుల వివరాలు రవాణా శాఖకు చేరుకుంటాయి. వారు పరిశీలించి సదరు వ్యక్తికి నోటీసులు పంపిస్తారు. పది రోజుల్లో తన వివరణను ఆర్టీఏ అధికారులకు సదరు వ్యక్తి ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం, రవాణ శాఖ అధికారులు నిర్ణయం మేరకు లైసెన్స్ రద్దు జరుగుతుంది. కోర్టు నిబంధనల ప్రకారం, లైసెన్స్ రద్దు జరుగుతుంది.

అవగాహన తప్పనిసరి..!

కొత్తగా లైసెన్స్ పొందాలనుకునే వారికి రోడ్డు భద్రతపై ఆర్టీఏ అధికారులు పూర్తి అవగాహన కల్పిస్తున్నారు. అందుకోసం నిబంధనలు సూచించే మూడు గంటల వీడియో వీక్షించేలా ఏర్పాట్లు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రమాద రహిత ప్రయాణంపై రవాణా శాఖ అధికారులు మూడు గంటల వీడియోను రూపొందించారు. ఈ వీడియోను లైసెన్స్ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరు వీక్షించాల్సి ఉంటుంది. ప్రత్యేక రూంలో ఈ వీడియోను ప్రదర్శిస్తారు. ప్రమాదాలపై అవగాహన కల్పించే వీడియోను వీక్షించిన అనంతరం, లైసెన్స్ ప్రక్రియ జరుగుతుంది. ఈ మేరకు ఆర్టీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రమంతా అమలు చేయడంలో భాగంగా ముందుగా పైలెట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయాల్లో వీడియో ప్రదర్శన అమలు చేయనున్నట్టు ఓ అధికారి తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడం వలన జరిగిన యాక్సిడెంట్లు, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన కలిగిన ప్రమాదాలు, అతివేగంతో కూడిన ఘటనలు, బాధిత కుటుంబాల ఆవేదన తదితర హృదయ విదారక ఘటనలతో కూడిన వీడియోను ప్రదర్శించి వాహనదారులకు ప్రమాద రహిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

సైకిల్ ట్రాక్ దుస్థితి ఇది.. బీఆర్ఎస్ హయాంలో మంచిరేవుల అప్పా జంక్షన్ వద్ద నిర్మించిన సైకిల్ ట్రాక్ ప్రస్తుతం నిర్వహణ లోపంతో ఇలా తయారైంది. ఇందులోని గ్రీనరీని తినేందుకు పశువులు వస్తుండటంతో ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారుతున్నది.

విద్యార్థి యువగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మాల, మాదిగ ఉద్యమాన్ని తప్పదోవ పట్టించేలా కుట్ర

కుయుక్తులకు మంద కృష్ణ, వివేక్ వెంకటస్వామే కారణం

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డా.పిడమర్తి రవి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 30: తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించేలా మాల, మాదిగ ఉద్యమాన్ని 'నాగా - కుకి' కొట్లాటగా మార్చే కుట్ర చేస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి ఆరోపించారు. దీనికి అంతటికీ మంద కృష్ణ మాదిగ, వివేక్ వెంకటస్వాములే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. వచ్చే నెల 2న నిర్వహించనున్న మాదిగ విద్యార్థి యువగర్జన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిడమర్తి రవి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణ జరగడం మంద కృష్ణకు ఇష్టం లేదని, అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. గడ్డం వివేక్, మంద కృష్ణల స్వార్థ ఉద్యమాల వలన తెలంగాణ రాష్ట్రంలో వర్గ భేదాలు సృష్టించి రాష్ట్రాన్ని అగ్గిగుండంగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వారు రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ మాల, మాదిగల మధ్య అగాధం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా మాదిగలను అణిచివేసిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ అవార్డును మంద కృష్ణ మాదిగ వెంటనే తిరస్కరించాలని డిమాండ్ చేశారు. లక్ష డప్పుల కార్యక్రమం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించాలని సూచించారు. వచ్చే నెల 2న ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మాదిగ విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి యువగర్జన సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు డాక్టర్ మల్లేశం, తిరుపతి, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, డాక్టర్ నంద్రు నరసింహ, మారపాక సాయిలు, రింగు రాంబాబు, గణేశ్, శివ, నరేశ్, ప్రవీణ్, మహేశ్, రాహుల్ పాల్గొన్నారు.

మారేడ్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను అభినందించిన కళాశాల చైర్మన్ నర్వోత్తమ్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజశ్రీ, తదితరులు

గిన్నిస్ బుక్ రికార్డుల్లో కస్తూర్బా విద్యార్థులు

కళాశాల ఆవరణలో విద్యార్థినులను అభినందించిన యాజమాన్యం

మారేడ్‌పల్లి, జనవరి 30: ఈ నెల 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర దిన వేడుకలలో తెలంగాణ రాష్ట్రం నుంచి మారేడ్‌పల్లి కస్తూర్బా గాంధీ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 120 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కళాశాల ఎన్సీసీ మేజర్ డాక్టర్ జయసుధ, టీం డైరెక్టర్స్ శ్రీధర్, నాగార్జున ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ మహిళా కళాశాల విద్యార్థినులు ఢిల్లీలో 'జయతి జయ మామా' అనే కార్యక్రమం ఇండియా గేట్ కర్తవ్య పథ్‌లో పాల్గొని, అభినయ సుధా కళా భారతి తరపున లంబాడి నృత్య ప్రదర్శన చేసి ప్రపంచ గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. గణతంత్ర వేడుకలకు గాను గత సంవత్సరం డిసెంబర్ నెల 26వ తేదీన ఢిల్లీకి వెళ్లిన విద్యార్థులు జనవరి 27వ తేదీన తిరిగి నగరానికి చేరుకున్నారు. ఈ మేరకు బుధవారం కళాశాల కమిటీ ప్రతినిధులు చైర్మన్ నర్వోత్తమ్ రెడ్డి, సెక్రటరీ ఫహిముద్దీన్, ట్రెజరర్ సురేశ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీ, ఎన్సీసీ మేజర్ డాక్టర్ జయసుధలు విద్యార్థులను సత్కరించి అభినందించారు.



మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సిబ్బంది

జీహెచ్ఎంసీలో బాపూజీకి ఘన నివాళి

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ): జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఇలంబర్తి గాంధీజీ చిత్ర పటానికి గురువారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అహింసా మార్గంలో భారత స్వాతంత్ర్య పోరాటాన్ని నడిపించి దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అందించిన మహాత్ముని ఆదర్శాలను అందరూ పాటించాలన్నారు. ఆయన బోధనలు సమాజ సమతుల్యతకు మార్గదర్శకం కావాలని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో ముగ్గురికి స్థాన చలనం

సిటీబ్యూరో, జనవరి 30(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో ముగ్గురు డిప్యూటీ కమిషనర్లకు స్థాన కల్పిస్తూ కమిషనర్ ఇలంబర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఖాజా మొహినుద్దీన్, సంతోషనగర్ డీసీ శైలజ, గోషామహల్ డీసీ విద్యాధర్‌లను మార్చుతూ కమిషనర్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ముషీరాబాద్ డీసీ ఖాజా మొహినుద్దీన్‌ను కరీంనగర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో అంబర్‌పేట డీసీకి మారుతి దివాకర్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. గోషామహల్, సంతోష్‌నగర్ డీసీల పోస్టింగులపై స్పష్టత రావాల్సి ఉంది.

ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న దామోదర్, ఎమ్మెల్సీ దయానంద్ తదితరులు

భక్తుల కొంగు బంగారం.. నాగ లింగేశ్వరస్వామి

ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో కొలేటి దామోదర్ గుప్తా

ఖైరతాబాద్, జనవరి 30: పెద్దపల్లి జిల్లా రాగినేడు గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీ నాగలింగేశ్వరస్వామి భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలుస్తున్నారని పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. శ్రీ స్వయంభూ నాగలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచికను గురువారం సాయంత్రం ఖైరతాబాద్‌లోని వాసవీ సేవా కేంద్రంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, వాసవీ సేవా కేంద్రం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్పూరు రమేశ్, నాచం ప్రభాకర్, జీవితకాల సభ్యులు కొండ్లె మల్లికార్జున్‌తో కలిసి ఆవిష్కరించారు. దామోదర్ మాట్లాడుతూ, 30 ఏండ్ల క్రితం రాగినేడు గ్రామంలో ఓ పొలం దున్నుతుండగా, స్వామి వారి లింగం బయల్పడిందన్నారు. నాటి నుంచి గ్రామస్తులు ఓ రావిచెట్టు కింద ప్రతిష్టించి పూజలు చేస్తున్నారన్నారు. పురావస్తు శాఖ చేపట్టిన పరిశోధనల్లో సుమారు 1200 ఏండ్ల శివలింగమని నిర్ధారించారన్నారు. చెట్టు కింద ఉన్న శివయ్య ఆలయంగా ప్రసిద్ధి గాంచిందన్నారు. స్వయంభువుగా వెలసిన స్వామి వారికి ఓ ఆలయాన్ని కట్టించాలన్న లక్ష్యంతో తన సొంత నిధులు రెండు కోట్లు, దాతల సహకారంతో అద్భుతమైన ఆలయాన్ని నిర్మించామన్నారు. ఆలయ నిర్మాణంలో ప్రధాన దాత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అందించిన సహకారం వెలకట్టలేనిదని, కోటి రూపాయల విరాళం అందించిన ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానికంగా ఉన్న ఓ దళితుడు తన రెండెకరాల నుంచి 23 గుంటల భూమిని ఉచితంగా దేవాలయం కోసం అందించడం గొప్ప విషయమన్నారు. ఆంజనేయస్వామి, నవగ్రహాలు, సాయిబాబా ఆలయాలను సైతం నిర్మించామన్నారు. ఆలయ చరిత్ర, విశిష్టతను వివరిస్తూ ప్రత్యేక సంచిక వెలవరించిన వైశ్య కిరణం యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. సుమారు 30 గ్రామాలకు చెందిన ప్రజలు వస్తారని, ఈ శివరాత్రికి లక్షలాది మంది స్వామి వారిని దర్శించుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కాచం సత్యనారాయణ, శంకర్, శివ, రాజు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో మహాత్ముని విగ్రహం వద్ద హామీలను అమలు చేయాలని డిమాండ్ మన్నె క్రిషాంక్, బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్, తదితరులు

సిగ్గులేని ప్రభుత్వం.. 420 పాలన సిగ్గు సిగ్గు

ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ క్రిషాంక్

బొల్లారం, జనవరి 30: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులైందని, ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఖనిజ అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిషాంక్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరిలోని మహాత్మాగాంధీ విగ్రహానికి బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్‌తో గురువారం నివాళులర్పించారు. అనంతరం, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసి బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా క్రిషాంక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, బీసీ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ, యువ డిక్లరేషన్ అమలు చేయాలన్నారు. వీటితో మహిళలకు ప్రతి నెల రూ.2500, కల్యాణ లక్ష్మి పథకంతో తులం బంగారం ఇస్తామని నమ్మించి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. అదే విధంగా రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని, ఇప్పటి వరకు ఏ రైతు ఖాతాలో నగదును జమ చేయలేదని తెలిపారు. 'సిగ్గు లేని ప్రభుత్వం, 420 పాలన సిగ్గు సిగ్గు' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్, యశ్వంత్ కుమార్, ఉమేశ్, సురేశ్, దప్పుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాపూఘాట్ వద్ద వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు దూదిమెట్ల బాలరాజు యాదవ్, మేడే రాజీవ్ సాగర్ తదితరులు

మెట్రో కోసం కూల్చివేతలు షురూ..

పాత నగరంలోనూ పరుగులు పెట్టనున్న మెట్రో!

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలో మీటర్లు

మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా నేలమట్టం కానున్న భవనం

చార్మినార్, జనవరి 30: పాత నగరవాసుల చిరకాల కల నెరవేరబోతుంది. నగర వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన మెట్రో త్వరలో పాత నగరంలోనూ పరుగులు పెట్టబోతుంది. ఎంతో కాలంగా ఎదురు చూసిన పాత నగరవాసులు మెట్రోలో ప్రయాణించే అవకాశం మరెంతో దూరంలో లేదు. అందుకు ఇప్పటికే పలుమార్లు మెట్రో అధికారులు పాత నగరంలో సర్వేలు చేపట్టి, భూసార పరీక్షలను సైతం పూర్తి చేశారు. పాత నగరంలో ఎంజీబీఎస్ నుంచి మొదలయ్యే మెట్రో చాంద్రాయణగుట్ట వరకు కొనసాగనుంది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు పాత నగరంలో మెట్రో 7.5 కిలోమీటర్ల దూరం కొనసాగనుంది. ఈ మార్గంలో ఇప్పటి వరకు 1100 ఆస్తులను పాక్షికంగాను, పూర్తిగాను తొలగించే అవకాశం ఉందని అధికారులు నిర్ధారించారు. ఇందులో ఇప్పటికే 270 మంది స్వచ్ఛందంగా తమ ఆస్తులను మెట్రో నిర్మాణ సంస్థలకు అప్పగించారు. అలా ముందుకు వచ్చిన వారికి జిల్లా అధికార యంత్రాంగం గజానికి రూ.81 వేల నష్ట పరిహారాన్ని అందించేందుకు సిద్ధమైంది. 270 మంది ఆస్తులు అందించేందుకు ముందుకు రాగా, 170 మందికి రూ.80 కోట్ల చెక్కులను అందించిన అధికారులు వారి ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన రోడ్డుకు సమీపంలో కొనసాగుతున్న ఆ భవనాలను అధికారులు కూల్చివేత పనులను వేగవంతం చేస్తున్నారు. మరో 3 నెలల నుంచి 4 నెలల కాలంలో మెట్రో రైల్ నిర్మాణం కోసం గుర్తించిన ఆస్తులను స్వాధీనం చేసుకుని పనులను మరింత వేగవంతం చేస్తామని మెట్రో రైల్ అధికారులు తెలిపారు.

ట్యాంక్‌బండ్‌పై వెల్‌నెస్ వర్క్‌షాప్

ఫిబ్రవరి 1 నుంచి జుంబా, యోగాపై అవగాహన

సిటీబ్యూరో, జనవరి 30(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై వెల్‌నెస్ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న ట్యాంక్‌బండ్‌పై ఉన్న లేక్ ఫ్రంట్ పార్కులో ఉదయం 6 గంటల నుంచి 2 గంటల పాటు జరిగే వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఇందులో యోగా, జుంబా డ్యాన్సులతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంపై అవగాహన కల్పించనున్నారు. నైసీ జోసెఫ్ నేతృత్వంలో జుంబా డ్యాన్స్, రేవతి బండారు సారథ్యంలో యోగాపై శిక్షణ ఇవ్వనున్నారు. రూ.100 రుసుముతో హెచ్ఎండీఏ ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్న గూగుల్ ఫారం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అందమైన హుస్సేన్ సాగర్ పరిసరాల నడుమ ఆరోగ్యాన్ని పెంపొందించుకునేలా వెల్‌నెస్ వర్క్‌షాప్‌ను తొలిసారిగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వేదికను ఏర్పాటు చేసింది. వారాంతంలో జనాల తాకిడిని పెంచడంలో, నగరంలో ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడంతో ఈ తరహా వేడుకలు ఎంతగానో తోడ్పడుతాయని హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి.

మహిళల ఆరోగ్య రక్షణకు భారత్‌తో కలిసి పనిచేస్తాం

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారెత్ ఓవెన్

పరిశోధనా భాగస్వామ్య సదస్సు ప్రారంభంలో పాల్గొన్న బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారెత్ ఓవెన్ తదితరులు

బంజారాహిల్స్, జనవరి 30: మహిళల ఆరోగ్య రక్షణ కోసం చేపట్టాల్సిన పరిశోధనలు, చికిత్సా విధానాలపై పరస్పరం సహకరించుకునేందుకు భారత్ - యూకే దేశాలు కలిసి పనిచేస్తాయని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారెత్ ఓవెన్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఫెర్నాండెజ్ స్టార్క్ హోమ్‌లో ఫెర్నాండెజ్ రీసెర్చ్ ఫౌండేషన్ - లివర్ పూల్ యూనివర్సిటీ పరిశోధనా భాగస్వామ్య సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సును ప్రారంభించిన గ్యారెత్ ఓవెన్ మాట్లాడుతూ, యూకే - భారత్ మధ్యన విద్య, ఆరోగ్య, సంరక్షణ సహకారాల్లో ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. పరిశోధనా ఆధారిత విధానాలను పరస్పరం తెలుసుకోవడం ద్వారా తల్లులు, నవజాత శిశువుల సంరక్షణను మెరుగుపర్చాలన్న ఉమ్మడి లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. కార్యక్రమంలో లివర్ పూల్ యూనివర్సిటీలో మహిళా ఆరోగ్య విభాగం ఇండియా లీడ్ ప్రొ. షకీలా తంగరతిన, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్పర్సన్ డా. ఎవిటా ఫెర్నాండెజ్, యూనిసెఫ్ ఫీల్డ్ ఆఫీస్ చీఫ్ జెలాలెం బిర్హా, తెలంగాణ ప్రభుత్వ ప్రసూతి శిశు ఆరోగ్యం ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

విదేశాలకు పారిపోతుండగా అరెస్ట్

మల్లంపేట శ్రీలక్ష్మి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ అధినేత గుర్రం విజయలక్ష్మి

శంషాబాద్ విమానాశ్రంలో లేడీ రియల్టర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మల్లంపేట్‌లో హైడ్రా కూల్చిన విజయలక్ష్మి నిర్మించిన విల్లాలే..

విజయలక్ష్మిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

దుండిగల్, జనవరి 30: శ్రీలక్ష్మి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకురాలు గుర్రం విజయలక్ష్మి(48)ని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేట్‌లోని సర్వే నం. 170/3, 170/4, 170/4/ఏకు సంబంధించిన భూముల్లో విజయలక్ష్మి శ్రీలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్, భావనాస్ జీఎల్‌సీ క్రిబ్స్ పేరుతో 2018లో వెంచర్‌ను ప్రారంభించారు. ఇందులో 120, 150, 200, 300 గజాల విస్తీర్ణంలో ప్రభుత్వ అనుమతుల పేరిట విల్లాలను నిర్మించి సుమారు 325 మంది కస్టమర్లకు విక్రయించింది. అయితే, బ్రోచర్‌లో పేర్కొన్నట్లుగా స్మిమ్మింగ్ పూల్, యోగా రూం, ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలను ఏర్పాటు చేస్తానని కస్టమర్ల వద్ద నుంచి వందల కోట్ల రూపాయలను వసూలు చేసింది. అయితే, సదరు విల్లాలలో వసతులు కల్పించకపోగా, కొనుగోలుదారులతో తరచు గొడవ పడుతుండేది. కనీస వసతులైన తాగునీరు, మురుగునీటి తరలింపు, విద్యుత్ మీటర్ల వంటి వసతులను కల్పించడంలో విఫలమైంది. దీంతో కొనుగోలుదారులతో విజయలక్ష్మికి 2021 నుంచి వివాదం నడుస్తుంది. తమ వద్ద కోట్లాది రూపాయలు వసూలు చేసి కనీస వసతులు కల్పించడం లేదంటూ 2021లోనే కస్టమర్లు విజయలక్ష్మిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విజయలక్ష్మి నిర్మించిన విల్లాల